
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 15 జూన్ 2025



నాన్న.. నీ మనసు వెన్న

- తండ్రి ప్రోత్సాహంతోనే ఉన్నత రంగం
- నేడు ఫాదర్స్ డే



శ్రీకాకుళం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నాన్న... రెండు అక్షరాలే.. కానీ కుటుంబానికి వెన్నెముక. తాను జీవితంలో అనుభవించిన కష్టాలు.. చవిచూసిన బాధలూ.. తన పిల్లలు పడకూడదనే నిరంతరం పనిచేసే శ్రమజీవి. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా జిల్లాలో పలువురి ప్రముఖులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారి ఉన్నతాభివృద్ధి వెనుక తండ్రి ప్రోత్సాహం మరువలేనిదంటూ.. పేర్కొన్నారు. తండ్రి త్యాగం, ప్రేమ, బాధ్యతలను గుర్తుచేసుకుంటూ అంతరంగాన్ని పంచుకున్నారు.

శ్రమించి చదివించారు


వెంకట్రామిరెడ్డి


ఎస్పీ మహేశ్వరరెడ్డి

మా సొంత ప్రాంతం రాయచోటి. నాన్న పేరు వెంకట్రామిరెడ్డి. మాది చిన్న వ్యవసాయ కుటుంబం. అయినప్పటికీ శ్రమించి మమ్మల్ని చదివించారు. పిల్లలు ఉన్నత రంగంలో స్థిరపడ్డారంటే కచ్చితంగా ప్రతి కుటుంబంలో తండ్రి పాత్రకీలకం. మా నాన్న మా చదువుకోసం ఎంతగానో శ్రమించారు.. ప్రోత్సహించారు. అందుకే ఈరోజు ఆదేరీతిన తండ్రి లక్ష్యాన్ని నెరవేర్చేలా కష్టపడి.. ఇప్పుడు ఈ స్థానంలో కొనసాగుతున్నాం. మా నాన్న శ్రీకాకుళంలో మాతోనే ఉన్నారు.

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

తప్పు చేయొద్దని చెప్పారు

మా తాత సర్దార్ గౌతు లచ్చన్న. తాత గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. మా నాన్న గౌతు శ్యామసుందర శివాజీ. తాత నుంచి మానాన్న నిజాయితీ.. ముక్కుసూటి తనం నేర్చుకుని అదే జీవితంలో అమలు చేశారు. మూడున్నర దశాబ్దాలు ఎమ్మెల్యేగా ప్రజలకు మా నాన్న శివాజీ సేవలు అందించారు. మా నాన్నకు మగ పిల్లలు లేరు. మేమే. అయినప్పటికీ.. ఏవిషయంలోనూ వెనకడుగు వేయలేదు. మా చదువు నుంచి పెళ్లి వరకు మా ఇష్టాన్ని గౌరవించారు. 'జీవితంలో ఏనాడూ తప్పు చేయవద్దు.. తప్పు చేస్తే కార్యకర్త వద్దనైనా సరే తలవంచాల్సిందే' అని చెప్పారు. నీతినిజాయితీ పరమావధి అన్నది నాన్న నమ్మిన సిద్ధాంతం. ఈ రోజు గౌరవం.. గుర్తింపు.. మా నాన్న వల్లనే. నాన్న, తాత పేరు నిలబెట్టడమే నా ధ్యేయం.


తండ్రి గౌతు శివాజీతో ఎమ్మెల్యే శిరీష

- గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస


నాన్న దినకర్‌తో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నాన్నప్రేరణతోనే ఐఏఎస్ అయ్యా..

మాది మహారాష్ట్ర. మా నాన్న పేరు దినకర్ పుండ్కర్. ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన ప్రభుత్వ రంగంలో పనిచేస్తూ ప్రజలకు సేవ చేసేవారు. కొడుకు కలెక్టర్ కావాలని.. అందుకు అవసరమైన ప్రిపరేషన్.. సూచనలు ఇచ్చేవారు. నాకు మా నాన్న ఇచ్చిన తర్ఫీదు.. సూచనలు చాలా బాగా పనికివచ్చాయి. నాన్న ప్రోత్సాహం వల్లనే కలెక్టర్ అయ్యాను. ప్రజలకు సేవ చేస్తున్నా. ఇప్పటికీ నా పేరులో మా నాన్న పేరును కూడా జోడించి 'స్వప్నిల్ దినకర్ పుండ్కర్'గా మార్చుకున్నాను. మా నాన్న ఇప్పుడు శ్రీకాకుళంలోనే నాతోనే ఉంటున్నారు. నాన్న గురించి ఎంత చెప్పినా తక్కువే.

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నాన్న పేరుతోనే ట్రస్టు నెలకొల్పా..


ఎమ్మెల్యే ఎంజీఆర్


తండ్రి అప్పారావు(ఫైల్)

మా నాన్న మామిడి అప్పారావు. పాతపట్నం మండలం తామర గ్రామం. ఎన్నో కష్టాలను చవిచూశారు. తాను కూలి పని చేసి.. నన్ను ఎంఎస్సీ చదివించారు. అప్పట్లో రోజు కూలి రూ.7. ఆ డబ్బులను ఖర్చు చేయకుండా నాకు కళాశాల వెళ్లివచ్చేందుకు చార్జీలకు ఇచ్చేవారు. నాన్న అనారోగ్యంతో మరణించారు. నాన్న పేరుతో రూ.10 కోట్లతో 'మామిడి అప్పారావు' ట్రస్టు నిర్వహించి.. సేవా కార్యక్రమాలు చేపట్టాను.

- మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

అది ప్రమాదమేనంట!

- కూర్మ ఘటనపై పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- మందిరం దగ్ధంపై స్వాముల్లో అనుమానం
- ఉద్దేశపూర్వకంగానే చేశారంటూ ఆరోపణ


కూర్మ గ్రామంలో బూడిదైన ప్రార్థనా మందిరం (ఫైల్)

హిరమండలం/కొత్తూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హిరమండలం మండలం అక్రాపల్లి పంచాయతీ కూర్మ గ్రామంలోని నంద గోకులం గోశాల ట్రస్టు ప్రార్థనా మందిరం కాలిపోవడానికి విభిన్న కారణాలు వినిపిస్తున్నాయి. అది అగ్నిప్రమాదమేనని స్థానిక పోలీసులు చెబుతున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇదే విషయం స్పష్టం చేస్తున్నారు. మంగళవారం రాత్రి కూర్మ గ్రామంలోని ప్రార్థనా మందిరం అగ్నికి ఆహుతైంది. మూత్రవిసర్జనకు బయటకు వచ్చిన శ్రీకాంత్ కేశవదాస్ ఆ మంటలను చూసి కేకలు వేయగా.. పరిసరాల్లో నివాసం ఉంటున్న వారు వచ్చేలోపు ప్రార్థనా మందిరం కాలి బూడిదైంది. మందిరంలో దీపాల వల్ల అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఇందుకు ఒడిగట్టారని అక్కడ నివాసం ఉంటున్న స్వాములు ఆరోపిస్తున్నారు.

- ప్రాచీన భారత జీవన విధానాన్ని పాటించడం కోసం 2019లో నంద గోకులం గోశాల ట్రస్టు పేరుతో కూర్మ గ్రామంలో 60 ఎకరాలను ప్రభుత్వ ధరకు కొనుగోలు చేశారు. అప్పటి నుంచీ పర్ణశాలలు, గోశాల, వేద (మిగతా 4వ పేజీలో..)

అగ్నిప్రమాద ఘటనలో దురుద్దేశం లేదు : ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'ఆధ్యాత్మిక కేంద్రం శ్రీకూర్మ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఎటువంటి దురుద్దేశం లేదు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడుతున్నా'మని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అగ్ని ప్రమాద ఘటనలో వ్యక్తిగతంగా, అల్లరిమూకల ప్రమేయం లేదు. కూర్మ గ్రామ సభ్యులు ప్రతిరోజూ దీపాలు వెలిగిస్తారు. పూజ చేసిన అనంతరం ఆ దీపాలు ఆర్పివేసి వెళ్లిపోతారు. కాగా.. ఏదైనా దీపం పొరపాటున పూర్తిగా ఆగకపోయి ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రస్తుతానికి భావించాం. ఈ ఘటనపై ఇప్పటికే ప్రమాద స్థలంలో భౌతిక ఆధారాలు సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించాం. సాంకేతిక ఆధారాలు బట్టి అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నా'మని ఎస్పీ తెలిపారు. అవాస్తవాలు, వదంతులు ఎవరూ నమ్మవద్దని సూచించారు. అవాస్తవాలు ప్రచార చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'కూర్మ' ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ ఆరా

- దర్యాప్తునకు ఆదేశం

అమరావతి, హిరమండలం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలోని కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై ఆయన ఆరా తీశారు. ఈ సంఘటనపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచించినట్లు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలన్నారు. కూర్మగ్రామంలో ప్రస్తుత పరిస్థితులపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.


అవినాష్, యువరాజ్, మేఘసాయి వర్ధన్, మైత్రి, జుహిత, ఝాన్సీలక్ష్మీశృతి

నీట్‌లో సిక్కోలు సత్తా

- జిల్లా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

శ్రీకాకుళం/ వజ్రపుకొత్తూరు/ సోంపేట / పోలాకి/ జలుమూరు/ నరసన్నపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యకు సంబంధించిన నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించారు. అరసవల్లిలో వెలమవీధిలో నివాసముంటున్న పొదిలాపు అవినాష్ ఆల్‌ఇండియా 64వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఓబీసీ కేటగిరిలో 15వ ర్యాంకు సాధించాడు. దీంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధుల్లేవు. తండ్రి శ్రీనివాసరావు ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ.. వ్యాపారం చేస్తున్నారు. అవినాష్ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు శ్రీకాకుళంలో.. పదో తరగతి వరకు కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్ విజయవాడలో పూర్తిచేసి నీట్‌లో మెరిశాడు. ఎంబీబీఎస్ చేసి.. ఆపై పీజీ చేసి ప్రజలకు ఉపయోగపడాలన్నదే తన లక్ష్యమని అవినాష్ వెల్లడించాడు.

- వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన దున్న యువరాజ్ నీట్ ఫలితాల్లో ఆలిండియాస్థాయిలో 207 ర్యాంక్, ఓబీసీ విభాగంలో 51వ ర్యాంక్ సాధించాడు. మొత్తం 720 మార్కులకుగాను 632 మార్కులు పొందాడు. యువరాజ్ తండ్రి దున్న లక్ష్మీనారాయణ ప్రైవేటు ఉద్యోగి కాగా తల్లి కుమారి ఏఎన్ఎం. యువరాజ్‌కు మంచి ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- సోంపేటకు చెందిన మేఘసాయి వర్ధన్ నీట్‌లో ఆలిండియా స్థాయిలో 942 వ ర్యాంకు, ఓబీసీ కోటాలో 277 ర్యాంకు సాధించాడు. మేఘసాయి వర్ధన్‌కు తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు. ఉపుతున్నారు.
- పోలాకి మండలం తోటాడ గ్రామానికి చెందిన తర్ర మైత్రి ఆల్ ఇండియా స్థాయిలో 2,672 ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 948 వర్యాంక్ సాధించింది. ఈమె తల్లి చింతు ప్రభావతి.. శాలిహుండం కేజీబీవీ ఉపాధ్యాయురాలు. తండ్రి వైకుంఠరావు గుజరాతీపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.
- సారవకోట(మిగతా 4వ పేజీలో..)

నిత్యం యోగాతో ఆరోగ్యం

- 21న జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

4 లో



21 నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

- 3న సీట్ల కేటాయింపు

4 లో

రక్తదానంతో ప్రాణదానం

- డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

3 లో


ఇచ్ఛాపురం: నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం


టెక్కలిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

- చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం

టెక్కలి/ఇచ్ఛాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నిధులు బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో టెక్కలి మేజర్‌పంచాయతీ చేరివీధిలో శనివారం పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. అలాగే కోటబొమ్మాళి ప్రకాష్‌నగర్ కాలనీలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇద్దరు, ముగ్గురు ఉన్న పిల్లలకు కూడా డబ్బులు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం 13వవార్డు బెల్లుపడ గ్రామంలో తల్లిదండ్రులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమంది అర్హత కల్గిన పిల్లలకు తల్లికి వందనం డబ్బులు వేయటం శుభపరిణామమని అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే ఎంతోమేలు చేశారని కొనియాడారు.

ఒకేరోజు రూ.25 కోట్ల పనులు

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీలకు పచ్చజెండా
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో భాగంగా మరో అడుగు ముందుకేసింది. టెక్కలి నియోజకవర్గాన్ని ఐదేళ్లలో అభివృద్ధి చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా చర్యలు చేపడుతున్నారు. హామీల అమలులో భాగంగా ఆదివారం టెక్కలి, రావివలసల్లో రూ. 25కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరుగట్టు అభివృద్ధికి సుమారు రూ.13కోట్లతో పనులు చేపట్టనున్నారు. అలాగే రూ.4 కోట్ల ఉపాధి నిధులు, రూ.కోటి మండల పరిషత్ నిధులు, రూ.2కోట్ల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌తోపాటు వివిధ సంస్థల సీఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్లకు సిద్ధం చేశారు. మరోవైపు గత నెల 22న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రావివలస గ్రామస్థులతో 'మన ఊరు.. మాటామంతీ'లో భాగంగా ఇచ్చిన హామీలను రూ.12కోట్ల అంచనాతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో రూ.3.50కోట్ల ఉపాధి నిధులతో ప్రసిద్ధ శైవక్షేత్రం రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి రోడ్లు, రిటర్నింగ్ వాల్స్, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే చిన్న నారాయణపురానికి రూ. 3.50కోట్లతో సీసీ రోడ్లు, కల్వర్టులు, కాలువల నిర్మాణం, దామోదరపురానికి రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు, శ్మశానవాటికకు రహదారి నిర్మించనున్నారు. రావివలసలోని (మిగతా 4వ పేజీలో..)


రావివలసలో శంకుస్థాపన చేయనున్న ఎండలమల్లన్న ఆలయ రహదారి


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి తదితరులు

విమాన ప్రమాద మృతులకు నివాళి

అరసవల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లోని విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ అరసవల్లిలో మాజీఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ విమానంలో ప్రయాణికులతోపాటు హాస్టల్ మెస్‌లో భోజనం చేస్తున్న వైద్య విద్యార్థులు కూడా చనిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

డాక్టర్‌కే మోసం

- ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్టు
- రూ.6 లక్షల నగదు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నేరస్థులు ఒకటో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. 'జిల్లాలో తొలిసారిగా డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ వైద్యురాలిని మోసగించి సుమారు రూ.16 లక్షలు కాజేశారు. జెమ్స్ మెడికల్ కాలేజ్‌లో పనిచేస్తున్న డాక్టర్ రేవతికి గత నెల 14న ఉదయం 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. బెంగుళూరు అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి సైబర్ నేరగాళ్లు రేవతిని బ్లాక్‌మెయిల్ చేశారు. హ్యూమన్ ట్రాకింగ్ చేయించే కేసులో మీ పేరు ఉందంటూ.. సీబీఐ కేసు నమోదు చేసి విచారిస్తున్నామని బెదిరించారు. కేసు విషయంలో సుప్రీంకోర్టులో వాదించేందుకు కొంత డబ్బును డిపాజిట్ చేయాలని (మిగతా 4వ పేజీలో..)


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద, పోలీసుల అదుపులో నిందితులు

బిజినెస్ ప్లస్

శ్రీకాకుళం ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ

హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲



నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.

లవ్ యూ U నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్లు పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెల్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.



వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..

ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసికి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్



వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం

మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జిఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ అరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 138 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.



మార్‌క్రమ్

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిలీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

రక్తదానంతో ప్రాణదానం: డీఎంహెచ్‌వో



శ్రీకాకుళంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు



ఇచ్ఛాపురంలో రక్తదానం చేస్తున్న యువకులు

శ్రీకాకుళం రిమ్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మనిషి ప్రాణానికి రక్తం ఎంతో అవసరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. రక్తదానంతో ప్రాణదాతలు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రిమ్స్ కళాశాలలో శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మనిషి శరీరంలో సుమారు 6 లీటర్ల రక్తం ఉంటుందని, ఇది నిరంతరం శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుందన్నారు. రక్త కణాల వయసు 120 రోజులు మాత్రమేనని... రక్త కణాలు నశించిన తరువాత కొత్తవి ఎముక మజ్జ నుంచి తయారవుతాయని తెలిపారు. రక్తదానంతో ఎటువంటి నష్టం లేదని వివరించారు. పెద్ద ప్రమాదాలు, తలసీమియా, సికిల్‌సెల్ అనీమియా వంటి కేసుల్లో రక్తం అందించడం వల్ల ప్రాణాలు నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.పార్వతి, పరిపాలనాధికారి బి.రాజశేఖర్, బ్లడ్ బ్యాంక్ వైద్యురాలు డాక్టర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకునే అవకాశం

ఇచ్ఛాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నియోజకవర్గ తెలుగు యువత , జేసీఐ అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో జేసీఐ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రిమ్స్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి దీన్ని ప్రారంభించారు. 52మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇప్పటి వరకు 191సార్లు రక్తదానం చేసిన బొడ్డేపల్లి శ్రీనువాస్‌ను ఘనంగా సత్కరించారు. రక్తదాతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కె .జయదేవ్, సెక్రటరీ డాక్టర్ మోహన్, ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ వెచ్చా సంతోష్, జోన్ అధికారి తంగుడు షణ్ముఖ, డాక్టర్ మట్టా శ్రీనువాస్, వెచ్చా రాము, వాసవి, పవన్, మల్లేష్, రాజ్‌కమల్, సంతోష్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురికి 'తల్లికి వందనం'


పిల్లలతో ఢిల్లమ్మ

కవిటి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని లండారిపుట్టుగ పంచాయతీ కొండిపుట్టుగ గ్రామానికి చెందిన బంగారు ఢిల్లమ్మ, టొంకారావు దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో బి.మనీషా, బేబీశ్రీ, నవ్య అనే ఆడపిల్లలతో పాటు యుగంధర్ అనే మగపిల్లాడు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా వీరికి ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున రూ.52వేలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. దీంతో ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. గతంలో ఒక్కరికి మాత్రమే రూ.13వేలు వచ్చాయన్నారు. పిల్లలందరికీ పథకాన్ని వర్తింపజేయడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

జి.సిగడాంలో...


కుమార్తెలతో రమణ దంపతులు

జి.సిగడాం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తల్లికి వందనంలో భాగంగా రూ. 52 వేలు మంజూరయ్యాయి. పాండ్రంకి రమణ, నాగమణి దంపతుల కుమార్తెలు హారిక, పల్లవి, సంధ్య, సుజాత ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి కూటమి ప్రభుత్వం తల్లికివందనంలో భాగంగా నగదు జమ చేయడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రమణ, నాగమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు రుణపడి ఉంటామని అన్నారు.

జగన్ సమర్థించడం సరికాదు



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న తెలుగు మహిళలు

అరసవల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు కావడం పట్ల వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేయడం, ఆ మాటలను సమర్థించడం సరికాదని తెలుగు మహిళా నాయకులు గొండు స్వాతి శంకర్, మెట్ట సుజాత అన్నారు. శనివారం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద మహిళలతో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ఆడపడుచులపై ఏ మాత్రం గౌరవం లేదనడానికి జగన్‌రెడ్డి మాటలే ఉదాహరణ అని పేర్కొన్నారు. వెంటనే జగన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను కించపరిచిన సాక్షి మీడియాను రద్దు చేయాలని డిమాండ్ చేశరు. ఈ కార్యక్రమంలో కవ్వాడి సుశీల, కొమర కమల తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి


ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నేతలు

కవిటి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి కవిటిలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ స్థానిక మూడురోడ్ల కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



మాట్లాడుతున్న యుగంధర్

అరసవల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని... నిరుద్యోగ భృతి ని అంద జేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని.. భృతి ఎప్పుడిస్తారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నగరంలోని క్రాంతి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుద్యోగికీ రూ.3000 భృతి అందజేస్తామని చెప్పి.. ఇంతవరకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే నిరుద్యోగ భృతి కల్పించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు పిలుపునిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొన్న శ్రీనివాస్, నాయకులు ఆర్.అరవింద్, వై.వేణు, ఎ.రాము, ఎస్.రామోజీ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు యోగా శిక్షణ


యోగాంధ్రలో పాల్గొన్న వేతనదారులు

సరుబుజ్జిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగం గా శనివారం స్థానిక ఎంపీడీఓ పి.పావని ఆ ధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన యోగా శిక్షణ ఉపాధి కూలీలు కూడా పాల్గొ న్నారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.బాలరాజు, మండల పరిషత్ ఏవో బి.వి.ఎస్. ప్రసాద్, ఎస్‌బీఎం మండల కో-ఆర్డినేటర్ ఎస్.రమణబాబు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కంచిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్య ఫౌండేషన్‌లో మండల న్యాయసేవా అధ్యక్షులు కె. కిషోర్‌బాబు ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను శారీరక, మానసిక వేధింపులకు గురిచేయడం నేరమన్నారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ బి.మంగరాజు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకపోతే ఆమరణ దీక్ష

శ్రీకాకుళం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 31వ రోజు నిరసన కార్య క్రమంలో భాగంగా శనివారం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల జంక్షన్ మీదుగా అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

హెల్త్ వర్సిటీ ఈసీ మెంబర్‌గా సుధాకర్

ఆమదాలవలస, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పట్టణానికి చెందిన వైద్యుడు, టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ చాపర సుధాకర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి 8 మంది సభ్యులతో కూడిన కొత్త కమిటీ నియామకానికి సీఎం చంద్రబాబునాయుడు ఆమోదించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రులు లోకేష్, సత్యకుమార్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు

పొందూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పొందూరు పైడితల్లి అమ్మవారి పండుగలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో భాగంగా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ వి.సత్య నారాయణ పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే


ఎచ్చెర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, ఎంపీడీవో ఎస్.హరి హరరావు, తహసీల్దార్ బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం/లావేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఈశ్వరరావు కోరారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో శనివారం యోగాపై అవగహన కల్పించారు. అనంతరం రాయితీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. లావేరు బొడ్డపాడు వద్దగల సివిల్ సప్లయిస్ గోదాం వద్ద ప్రభుత్వ ఉద్యోగులు, పార్టీ నాయకులతో సమావేశమై యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాయితీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. పాడిరైతులకు సబ్సిడీపై దాణాను, విద్యార్థులకు విద్యాకిట్లు అందజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి విశ్వక్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు

ఇచ్ఛాపురం, జూన్14(ఆంధ్రజ్యోతి): రత్తకన్న గ్రామంలో 100మంది రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేసినట్టు నీటి సంఘ అధ్యక్షుడు బుగత జగన్ అన్నారు. శనివారం గ్రామంలో 100బస్తాల విత్తనాలు పంపిణీ చేశారు. మరో 100 బస్తాల విత్తనాలు రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిన్న లక్ష్మీనారాయణ, డి. పిల్లయ్య, డి.జోగయ్య, చంద్రయ్య, సోమయ్య పాల్గొన్నారు.

పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోండి


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

లావేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రమశిక్షణ గల పార్టీ అని... అందులోని వారంతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం లావేరులోని ఓ కల్యాణ మండపంలో మండల టీడీపీ నూతన కార్యవర్గ ఎన్నికలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకితభావంతో అందరూ పని చేయాలన్నారు. ఇదిలా ఉండగా... మండల టీడీపీ అధ్యక్ష పదవికి స్వల్ప పోటీ ఏర్పడింది. ఎక్కువ శాతం పాత కమిటీనే కొనసాగించాలని కోరారు. పెద కొత్తపల్లి, చిగిరికొత్తపల్లి, లింగాల వలస, పెదరావుపల్లి, చిన మురపాక, కొత్తకుంకాం గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈసారి కొత్తవారికి అవకాశం కల్పించాలని సభ ముందు ఉంచారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాటకు దారి తీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో శాంతించారు. దీంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ విషయాని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ఆనెపు రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ తోటయ్యదొర, నాయకులు లంక నారాయణరావు, లంకలపల్లి శ్రీనివాసరావు, పిన్నింటి మధుబాబు, గొర్లె శ్రీనివాసరావు, కె.దామోదరరావు, మీసాల వెంకటరమణ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి భారీగా బదిలీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 19 మంది ఆర్‌ఐలు, 33 మంది డిప్యూటీ తహసీల్దారులు, 18 మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేసారు.

హామీలను నిలబెట్టుకుంటున్నాం: ఎమ్మెల్యే


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

అరసవల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించాం. హామీ ఇచ్చిన విధంగానే ఒక ఇంటిలో చదువుకుంటున్న పిల్లలందరికీ 'తల్లికి వందనం' పథకం ద్వారా నగదు అందజేశాం. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం' అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని, అభివృద్ధి, సంక్షేమం వైపు విజయవంతంగా నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు స్వాతీశంకర్, మెట్ట సుజాత, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, పాండ్రంకి శంక ర్, రెడ్డి గిరిజా శంకర్, సుశీల పాల్గొన్నారు.

విద్యార్థుల యోగాభ్యాసం

కవిటి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జగతి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం యోగాభ్యాసం చేశారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా మార్చుకోవాలని సచివాలయ సిబ్బంది కోరారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు


బోరు పనులను పరిశీలిస్తున్న మండల అధికారులు

పొందూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణంలో 15 ఏళ్ల తరువాత నిర్వహించనున్న అమ్మవారి పండుగ నేపథ్యంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. దీని కోసం రూ 13.50 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రవికుమార్‌కు మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా... వీధులలో చెత్త పేరుకుపోకుండా ప్రతి ఇంటికి రెండేసి గోనె సంచులను అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చెత్తను గోనెలలో వేసి కమిటీకి సహకరించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కవిటి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కొత్తకొజ్జిరియాలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద శనివారం వేకువజామున లగేజీ వ్యాన్‌లో తరలిస్తున్న పశువులను పట్టుకున్నామని ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఒడిశాలోని గొలంత్ర నుంచి ఆరు గేదెలను వ్యాన్‌లో కుక్కి... తిలారు సంతకు తీసుకొని వెళుతుండగా పట్టుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నారాయణవలసకు చెందిన డి.ప్రకాశరావుతో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పశువులను కొత్తవలస హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అప్పగించామని ఆయన చెప్పారు.

11 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

వజ్రపుకొత్తూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఒంకులూరు జీడి తోటల్లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం మాటువేసి పట్టుకున్నామన్నారు. వీరి నుంచి రూ.26 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గారలో 9 మందిపై కేసు

గార, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అచ్చెన్నపాలెం గ్రామం వద్ద శనివారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకొని వారి నుంచి రూ.16,920 నగదు స్వాధీనం చేసుకున్నారని ఏఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

బూర్జ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాఖండ్యాంలో నిర్వహిస్తున్న ఇసుక రీచ్ నుంచి చీడివలస గ్రామం మీదుగా వస్తున్న 50కి పైగా లారీలను రోడ్డుపై బైఠాయించి గ్రామస్థులు నిలిపివేశారు. రాత్రిపూట ఇసుక తరలిస్తున్న వందలాది లారీల వల్ల పిల్లలు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారని, రహదారి పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు పూర్తిగా అవకాశం లేకుండాపోయిందన్నారు. పిల్లలను బడికి పంపాలంటే భయంగా ఉందని గ్రామస్థులు వాపోయారు. ఇసుక రీచ్ నిర్వాహకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అందుకే రోడ్డుపై బైఠాయించి ఇసుక లారీలను నిలిపివేశామని వారు చెప్పారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నేతలు

టెక్కలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో మృతులకు నివాళి అర్పిస్తూ శనివారం రాత్రి వైసీపీ నేతలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్, నేతలు ఎన్.శ్రీరామ్మూర్తి, పి.వసంతరెడ్డి, సంపతిరావు రాజు, రాహుల్, యాదవ్, కిరణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌కే మోసం

(మొదటి పేజీ తరువాయి)

అంతవరకు మీ అరెస్టు ఆగుతుందని చెప్పారు. దీంతో భయపడిన వైద్యురాలు రేవతి.. వారు చెప్పిన పలు అకౌంట్లకు రూ.16లక్షలు ఆన్‌లైన్‌లో జమ చేశారు. కొన్ని రోజుల తర్వాత మోసపోయానని గ్రహించి.. ఆమె ఈ వ్యవహారంపై శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు సైబర్ నేరగాళ్లను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం అదుపులోకి తీసుకు న్నారు. ముద్దాయిలు మైసూర్‌కు చెందిన రుమన్ షరీఫ్, కాలికట్‌కు చెందిన నౌఫాలా షరీన్, కేరళకు చెందిన నిజాముద్దీన్‌చక్లాలుగా గుర్తించారు. ఆ ముగ్గురినీ విచారించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.6 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నామ'ని డీఎస్పీ తెలిపారు. విద్యావంతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు అధికంగా సైబర్ నేరగాళ్ల మాయలో పడి మోస పోతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన శ్రీకాకుళం రూరల్ సీఐ కె.పైడిపునాయుడు, ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ, ఎస్ఐ రాజేష్, కానిస్టేబుల్ ఈశ్వరరావు, రమణ, ధనలక్ష్మిని డీఎస్పీ అభినందించారు.

అది ప్రమాదమేనంట!

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలను, బ్రహ్మచారి ఆశ్రమాన్ని అభివృద్ధి చేశారు. 45 మంది వరకు స్వాములు నివాసం ఉంటున్నారు. ప్రాచీన జీవన విధానంతోపాటు సనాతన ధర్మం పరిరక్షణ దిశగా చర్యలు చేపడుతున్నారు. ఆశ్రమ అభివృద్ధికి భక్తివికాశ్ స్వామీజీ ప్రత్యేక కృషి చేశారు. ఆయన తర్వాత త్రిభంగానంద్‌దాస్ వ్యవహారాలు చూస్తారు. ఇక్కడి ప్రార్థనా మందిరంలో నిత్యం 300 మంది వేదపాఠశాలల విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు పఠిస్తారు. ఆదివారం ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. నాలుగేళ్ల కిందట ఆశ్రమ ఆవరణ గడ్డికుప్ప దగ్ధమైంది. ఏడాది కిందట ప్రార్థనా మందిరంలో హుండీ చోరీకి గురైంది. తాజాగా మంగళవారం ప్రార్థనా మందిరం దగ్ధమవడంతో స్వాములు ఆందోళన చెందుతున్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

'ప్రార్థనా మందిరంలో వేద పాఠశాల విద్యార్థులు నిత్యం శ్లోకాలు, భగవద్గీత పఠనం చేస్తుంటారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా అధిక మంది ప్రజలు కూడా వస్తుండడంతో ఈ ఆశ్రమానికి ఆదరణ పెరుగుతోంది. గిట్టని వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా ఘటనకు పాల్పడి ఉంటార'ని త్రిభంగానంద్‌దాస్, నరోత్తమ దాస్, లక్ష్మీహరిదాస్ తదితర స్వాములు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలుగజేసుకుని సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఆదుకుంటాం: ఎంజీఆర్

హిరమండలం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఆధ్యాత్మిక కేంద్రం కూర్మ గ్రామాన్ని పూర్తిగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు తెలిపారు. శనివారం గ్రామాన్ని సందర్శించి ప్రమాద వివరాలు సేకరించారు. అగ్నిప్రమాదం దురదృష్టకరమని, ప్రమాదానికి కారణాలు తెలుసుకుని నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. కావాలనే చేసి ఉంటే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

వల్లభరాయుడుపాడు-పాతటెక్కలి రోడ్డుకు మోక్షం

● స్థానికుల్లో హర్షాతిరేకాలు

నందిగాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం వల్లభరాయుడుపాడు నుంచి వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి వరకు ఉన్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉపాధి హామీ నిధులు రూ.85 లక్షలు మంజూరు కాగా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణానికి 2011-12లో అప్పటి కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి శంకుస్థాపన చేశారు. పుష్కరకాలం పూర్తయినా బీటీ రహదారి నిర్మాణం కాకపోగా గోతులమయమై పాదచారులు, వాహనచోదకులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంత్రి అచ్చెన్నాయుడు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంతో బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం వల్ల వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి జంక్షన్ నుంచి వల్లభరాయుడుతో పాటు దేవాడ, దొడ్లరామచంద్రాపురం, భరణిగాం, కొండపేట తదితర గ్రామాల వారికి, వజ్రపుకొత్తూరు వాసులకు ఎంతో ఉపయోగంపడుతుంది. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులకు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


బీటీగా మారిన వల్లభరాయుడుపాడు-పాతటెక్కలి రహదారి

యువత రక్తదానం చేయాలి: డీఎస్పీ


రక్తదానశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వి.వెంకటఅప్పారావు

పలాస, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు కోరారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక జీడి-రైస్ కార్మిక భవన్‌లో ఆ నలుగురు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ట్రస్టు నిర్వాహకులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, నరేష్ మన్మథ, వేణు, బొంపల్లి సింహాచలం, కోనారి రాము, నాగేశ్వరరావు, మోహన్ పాల్గొన్నారు.

ఓంశాంతి భవనంలో..

మెళియాపుట్టి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చాపర ఓంశాంతి భవనంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు అవకాశం కలుగుతుందని సంస్థ ప్రతినిధులు అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సుధారాణి, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చాపరలో రక్తదానం చేస్తున్న దృశ్యం

వంశధార సాగునీటి కోసం ఉద్యమం

హరిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం వరకు వంశధార నీటిని తరలించేందుకు ఉద్యమం చేపడతామని సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మథ రావు అన్నారు. కుంటికోట, అచ్యుతాపురం, వాసుదేవపురం గ్రామాల్లో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే తాగు, సాగు నీటి ఇబ్బందులు తొలగాలంటే వంశధారను ఇచ్ఛాపురం వరకు పొడిగించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదుల అనుసంధానం చేయాలని కోరారు. ఈ విష యమై ఎమ్మెల్యే శిరీష దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు హేమారావు చౌదరి, నల్ల హడ్డీ, వైకంఠరావు, పాపారావు, సోమనాథం, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ఒకేరోజు రూ.25 కోట్ల పనులు

(మొదటి పేజీ తరువాయి)

రెండు శ్మశాన వాటికలకు రూ.1.40 కోట్లతో సీసీ రోడ్లు, రావివలస పాతకాలనీ, కొత్తకాలనీలకు చెరో రూ.50లక్షలతో సీసీరోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టనున్నారు. రూ.15లక్షల నిధులతో బస్‌షెల్టర్, రూ.20 లక్షలతో దోబీఘాట్, చెరో రూ.10 లక్షలతో మూడు కళావేదికలు, రూ.20 లక్షలతో లైబ్రరీ, డీఎంఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.30 లక్షలతో డ్వాక్రా భవనం, రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మించనున్నారు. ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు అవసరమైన నిధులు విడుదలకు రంగం సిద్ధం చేశారు.

నిత్యం యోగాతో ఆరోగ్యం

● 21న జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


యోగా సాధన చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని, ప్రతిరోజు సుమారు 30 నిమషాలు యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో సుమా రు 2000 మందితో మాక్ యోగా శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆహారాన్ని ప్రతి దినం ఎలా తీసుకుంటారో అదేవిధంగా యోగాను సాధన చేయాలన్నారు. ఈనెల 21న ప్రపంచయోగా దినోత్సవం సందర్భంగా విశాఖకు ప్రధాని మోదీ వస్తున్నారని, అదేరోజు జిల్లా వ్యాప్తంగా సచివాలయ, మండల, జిల్లా స్థాయిల్లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు యోగ సాధనలో పాల్గొనని వారు యూట్యూబ్‌లో చూసి ప్రొటోకాల్ ప్రకారం యోగసాధన చేయాలని కోరారు. ఇకపై ప్రతీ దినం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు స్థానిక 80 అడుగుల రోడ్డులో యోగా, ఫిట్‌నెస్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని అధికారులు, సంస్థల ప్రతినిధులను కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వర రావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆయుష్ వైద్యాధికారి జగదీష్, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, డీఎస్డీవో శ్రీధర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు వి.సుధారాణి, ఎస్.కల్పన, డి.సురేంద్ర, యోగా శిక్షకులు కొంక్యాన మురళి, గాయత్రి, తంగి స్వాతి, దుంపల చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

జలుమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో వేయడంపై ఆనందం వెల్లివిరుస్తోంది. పలువురు మహిళలు శనివారం రావిపాడు గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు గుండ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చిన్నారావు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సమగ్ర సర్వే

మెళియాపుట్టి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో కొన్ని గ్రామాలను ఎంపికచేసి సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. గిరిజనులకు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే దిశలో ఈ సర్వే చేపడుతున్నారు. ఇంటిలోని అందరి వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో మెళియాపుట్టి మండలంలోని ఎనిమిది పంచాయతీల్లోని మర, కోతికోలిగాం, సుందరాడ, పడ్డ, పరశురాంపురం, కుడ్డబ, గొడ్డ, బందపల్లి గ్రామాలను ఎంపికచేశారు. హిరమండలం మండలం అల్లాట, కొత్తూరు మండలం అల్లితి, లబ్బ, అడ్డంగి, పాతపట్నం మండలంలో సరవ సిద్ధం, రంకిణి గ్రామాలను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సమగ్ర సర్వే చేపట్టి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు.

రేపు శ్యామసుందరస్వామి కల్యాణం

టెక్కలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తొలుసూరుపల్లి రోడ్డులోని శ్యామసుందరస్వామి ఆలయంలో ఈనెల 16న ఉదయం స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు రమేష్‌పండా తెలిపారు. ఈ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

దారుణంగా తయారైన వైనం
● ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులు

ఎల్.ఎన్.పేట/జలుమూరు/కొత్తూరు/మందస/నందిగాం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రధాన రోడ్లు గోతుల మయమై ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోతుల్లో నీరు చేరి నిలిచిపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. కొన్ని గోతుల్లో వాహనాలు సైతం దిగబడిపోవడం, అదుపు తప్పి ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఎల్ఎన్‌పేట, జలుమూరు, కొత్తూరు, మందస, నందిగాంమండలాల్లో పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చి రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయా మండలాల ప్రజలు కోరు తున్నారు.


కొత్తూరు: పాలకొండ-కొత్తూరు మార్గంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అదుపు తప్పిన వాహనం


ఎల్ఎన్‌పేట: బొర్రంపేట గ్రామం వద్ద అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డు...


జలుమూరు: కేఎల్ఎన్ పేట వద్ద


మందస: కరణం వీధిలో దారుణంగా ఉన్న రోడ్డు


నందిగాం: వల్లభ రాయుడు పాడు రోడ్డు

న్యూస్ బాక్స్

తహసీల్దార్‌గా ప్రసాదరావు



పాతపట్నం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాతపట్నం తహసీల్దార్‌గా నందిగాం ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రణస్థలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో పనిచేసిన ఎస్.కిరణ్‌కుమార్ రణస్థలం బదిలీ అయ్యారు. ప్రసాదరావును సిబ్బంది, వీఆర్వోలు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు.

నేడు వినాయక ఆలయ వార్షికోత్సవం

నందిగాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నందిగాం గణేష్ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయ వార్షి కోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అన్నప్రసాద వితరణ, నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృప కు పాత్రులు కావాలని కోరారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. యంబరాం, ఫాక్స్‌దొరపేట గ్రామాల మధ్య పంట పొలాల్లో విద్యుత్తు లైన్ల సమస్యను పరిష్కరించేందుకు గాను సంబంధిత అధికారు లతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. నాలుగురోజుల కిందట పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలి ఫాక్స్‌దొరపేట గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పడిన ఇబ్బందులను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా తగు చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వి.గోవిందరావు, ఎ.పోలినాయుడు, కె.కృష్ణమాచారి, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో సిక్కోలు సత్తా

(మొదటి పేజీ తరువాయి)

మండలం అలుదు గ్రామానికి చెందిన పాగోటి జుహిత నీట్ ఫలితాల్లో ఆలిండియాలో 2,744 వ ర్యాంకు సాధించింది. తండ్రి మురళీధరరావు బ్యాంకు ఉద్యోగి కాగా తల్లి హేమలత గృహిణి. జుహితను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

● నరసన్నపేటలోని మారుతీనగర్‌కు చెందిన సూరపు ఝన్సీలక్ష్మీశృతి నీట్ ఫలితాల్లో ఆలిండియాలో 3,202వ ర్యాంకు సాధించింది. ఝన్సీలక్ష్మీశృతి తండ్రి డా. కృష్ణారావు పాతపట్నం సామాజిక ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి మెండ సుధారాణి నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో చిన్నపిల్లలు వైద్యనిపుణులు. తల్లిదండ్రుల మాదిరి ప్రజలకు వైద్యసేవలను అందించడమే తన లక్ష్యమని ఝాన్సీ లక్ష్మీశృతి తెలిపారు.

సాయిచరణ్‌కు 7,999 ర్యాంక్..



సంతబొమ్మాళి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాశీపురానికి చెందిన దాసరి సాయి చరణ్‌కు నీట్ ఆలిండియాలో 7,999వ ర్యాంక్, ఓబీసీ విభాగంలో 3,276 ర్యాంక్ సాధించాడు. సాయిచరణ్ ఇటీవల ఈఏపీ సెట్ అగ్రి, ఫార్మా విభాగంలో రాష్ట్రస్థాయిలో 172వ ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం. మంచి ర్యాంక్ సాధించిన సాయిచరణ్‌ను కుటుంబసభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

21 నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

● 3న సీట్ల కేటాయింపు

ఎచ్చెర్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని జిల్లా సమన్వయకర్త, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య తెలిపారు. పాలిసెట్ ఉత్తీర్ణులై కౌన్సెలింగ్‌కు హాజరుకానున్న విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజును ఈ నెల 20వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే హెల్ప్‌లైన్ కేంద్రంలో కౌన్సెలింగ్ ఈ నెల 21న ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, టీసీ తదితర పత్రాలను తీసుకురావాలన్నారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల నమోదు ఉంటుందన్నారు. ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థులకు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు విజయవాడలోని బెంజి సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కళాశాలలు, బ్రాంచ్‌ల కేటాయింపు వివరాలు జూలై 3న పాలిసెట్ కన్వీనర్ విడుదల చేస్తారని తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలన ఇలా..

తేది	ర్యాంకు వివరాలు
21-6-2025	1- 15,000 వరకు
22-6-2025	15,001 - 32,000
23-6-2025	32001 - 50,000
24-6-2025	50,001 - 68,000
25-6-2025	68,001 - 86,000
26-6-2025	86,001 - 1,04,000
27-6-2025	1,04001- 1,20,000
28-6-2025	1,20,001- చివరి వరకు

వెబ్ ఆప్షన్ల నమోదు ఇలా..

తేదీలు	ర్యాంకు వివరాలు
25, 26	1 నుంచి 50,000
27, 28	50,001 నుంచి 90,000
29, 30	90,001 నుంచి చివరి వరకు
జూలై 1న	వెబ్ ఆప్షన్ల మార్పులు, చేర్పులు